క్లుప్తంగా

కలెక్టర్ క్యాంపు కార్యాలయానికి స్టిక్కర్



జనగామ: కుటుంబ సమగ్ర కుల సర్వేలో భాగంగా సమీకృత కలెక్టరేట్ ప్రాంగణంలోని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా క్యాంపు కార్యాలయానికి సర్వే అధికారులు శుక్రవారం స్టిక్కర్‌ను అతికించారు.

ఎమ్మెల్యే ఇంటికి..



కుటుంబ సమగ్ర కుల సర్వేలో భాగంగా జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఇంటికి అధికారులు శుక్రవారం స్టిక్కర్ అతికించారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్‌కు సత్కారం



రఘునాథపల్లి: హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ప్రారంభోత్సవానికి శుక్రవారం మండలంలోని ఆర్యవైశ్య సంఘం నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాతగుప్తను సంఘం నాయకులు శాలువాలు, మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కౌన్సిల్ సభ్యుడు, మాజీ సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు పోకల శివకుమార్, జిల్లా ఆర్య వైశ్య సంఘం ఉపాధ్యక్షుడు కూరెళ్ల ఉపేందర్, జిల్లా కార్యదర్శి శ్యాంశెట్టి శంకరయ్య, జోనల్ చైర్మన్ సోమేశ్వర్, బచ్చు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చైర్మన్‌ను కలిసిన లవన్



చిల్పూరు: ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కల్వ సుజాతను శుక్రవారం హైదరాబాద్‌లోని అరణ్య భవన్‌లో శుక్రవారం మండలంలోని వెంకటాద్రిపేట గ్రామానికి చెందిన ఆర్యవైశ్య మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు మంతెన లవన్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన చైర్మన్‌ను శాలువాతో సన్మానించారు.

పీహెచ్‌సీలో తనిఖీ



జనగామ రూరల్: ఓబుల్‌కేశవాపూర్ గ్రామంలోని పీహెచ్‌సీని శుక్రవారం డీఎంహెచ్‌ఓ మల్లికార్జున్‌రావు తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని పేషెంట్లను వారికి అందుతున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి సకాలంలో విధులకు హాజరు కావాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. మండల వైద్యాధికారి ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

చేయూత



స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని విశ్వనాథపురం గ్రామానికి చెందిన దివ్యాంగురాలైన సిట్టింగ్ పారా త్రోబాల్ అంతర్జాతీయ క్రీడాకారిణి మాచర్ల కృష్ణవేణికి ఇటీవల ప్రకటించిన విధంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరికి చెందిన రూ.30వేలు, రైస్ మిల్లర్ల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్నగుప్తాకు చెందిన రూ.20వేలు.. మొత్తం రూ.55వేలు బెలిదె వెంకన్న శుక్రవారం ఘన్‌పూర్‌లో ఆమెకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబానికి చెందిన కృష్ణవేణి సిట్టింగ్ పారాత్రోబాల్ క్రీడలో రాణిస్తూ అంతర్జాతీయ స్థాయికి మన దేశం తరపున ఎంపిక కావడం సంతోషకరమన్నారు. కాగా కంబోడియా దేశంలో జరిగే అంతర్జాతీయ పోటీలలో పాల్గొనేందుకు ఖర్చులకు తమవంతుగా ఇటీవల ప్రకటించిన విధంగా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. సింగపురం వెంకటయ్య, చింత ఎల్లయ్య, మాచర్ల కుమారస్వామి, ఆకుల కృష్ణంరాజు, రాపర్తి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

‘స్పెల్‌బీ’తో బంగారు భవిష్యత్

- ‘సాక్షి’ ఆధ్వర్యంలో పాఠశాలల్లో నిర్వహణ

జనగామ/స్టేషన్‌ఘన్‌పూర్: మారుమూల పల్లె నుంచి ప్రపంచం వరకు ఎక్కడ ఏ వార్త జరిగినా పాఠక లోకానికి అందిస్తున్న ‘సాక్షి’ దినపత్రిక విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు స్పెల్‌బీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. శుక్రవారం జిల్లా కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డు ఏకశిల పబ్లిక్ స్కూల్, జనగామ మండలం చౌడారం జేజీబీవీ గురుకులం, స్టేషన్ ఘన్‌పూర్‌లోని ఒయాసిస్.. మూడు పాఠశాలలో సాక్షి ఆధ్వర్యంలో గణితం, ఇంగ్లిష్‌లో జరిగిన స్పెల్‌బీ ఎంట్రెన్స్ ప్రోగ్రాం జరిగింది. పాఠశాలల వారిగా 200లకు పైగా విద్యార్థులు పాల్గొని తమలోని ప్రతిభను చాటుకున్నారు. విద్యార్థులు ఇలాంటి పోటీ పరీక్షల్లో పాల్గొనడం వలన ఇంగ్లిష్ పరంగా నాలెడ్జ్ పెరుగుతుందని ఏకశిల సెక్రెటరీ చిర్ర ఉపేందర్‌రెడ్డి అన్నారు. విద్యార్థుల ప్రతిభపాటవలను వెలికితీయడంలో సాక్షి ఎప్పుడూ ముందంజలో ఉంటుందని తెలియజేశారు. స్పెల్‌బీ, పోటీ పరీక్షలకు సంబంధించిన ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనే పాఠశాలలు–9505514424 నంబర్‌ను సంప్రదించాలన్నారు.



జనగామలోని ఏకశిల పబ్లిక్ స్కూల్‌లో స్పెల్‌బీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు



స్టేషన్‌ఘన్‌పూర్‌లోని ఒయాసిస్ ఉన్నత పాఠశాలలో స్పెల్‌బీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

రాష్ట్ర స్థాయికి వెళ్లేలా..



ప్రతి సారి సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించే స్పెల్ బీ పోటీ పరీక్షలో పాల్గొంటున్నా. జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీ పడే విధంగా ప్రిపేర్ అవుతున్నా. పోటీ పరీక్షల్లో పాల్గొనడం భవిష్యత్‌కు అవసరపడడంతో పాటు భయం పోతుంది.

- మారం ప్రణయ్, 6వ తరగతి, ఏకశిల పబ్లిక్‌స్కూల్, జనగామ

బాగా రాశాను..



సాక్షి స్పెల్ బీ మ్యాథ్స్, ఇంగ్లిష్ పరీక్షను బాగా రాశాను. ముందస్తుగా ప్రిపేర్ అయినప్పటికీ టఫ్‌గా ఉంది. అయినా ఆలోచించి క్వశ్చన్లకు జవాబు రాసినం. జిల్లా స్థాయికి ఎంపిక అవుతాననే నమ్మకం బలంగా ఉంది.

- కుందారపు సరయు, 7వ తరగతి, ఏకశిల పబ్లిక్ స్కూల్, జనగామ

పోటీ పరీక్షలపై పట్టు సాధిస్తాం..



సాక్షి స్పెల్ బీ పరీక్షలో పాల్గొనడంతో కొత్త విషయాలు తెలుస్తున్నాయి. సాక్షి ఇచ్చిన క్వచ్చన్ పేపర్ ప్రతీ విషయంపై పట్టు సాధించేలా ఉంది. భవిష్యత్‌లో పోటీ పరీక్షల్లో పట్టు సాధించడంతో పాటు ఉన్నత చదువుల కోసం దోహదపడుతుంది.

- డి.మహేశ్వరి, కేజీబీవీ గురుకులం, చౌడారం, జనగామ

పోటీ పరీక్షలకు సన్నద్ధం చేస్తుంది..



సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించే మ్యాథ్స్ బీ పరీక్ష విద్యార్థులను పోటీ పరీక్షలకు సన్నద్ధం చేసేలా ఉంది. గతంలో స్పెల్ బీ పరీక్షకు కూడా హాజరయ్యాను. విద్యారుల్లోని ప్రతిభను వెలికితీసేలా సాక్షి ఆధ్వర్యంలో ఇలాంటి పరీక్షలు నిర్వహించడం సంతోషకరం.

- కె.చరణ్, 8వతరగతి, ఒయాసిస్ స్కూల్, స్టేషన్‌ఘన్‌పూర్

సాక్షి మ్యాథ్స్ బీ పరీక్ష రాయడం సంతోషంగా ఉంది..



సాక్షి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మ్యాథ్స్ బీ పరీక్ష రాయడం ఎంతో సంతోషంగా ఉంది. ఇలాంటి పరీక్షలు పోటీపరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఇలాంటి పరీక్షల ద్వారా విద్యార్థుల సామర్థ్యాన్ని వెలికి తీస్తుంది.

-పబ్బోజు అక్షర, 9వ తరగతి, ఒయాసిస్ స్కూల్, స్టేషన్‌ఘన్‌పూర్

సరస్వతీదేవి ఆలయ ఆర్చ్ పనులకు శంకుస్థాపన

చిల్పూరు: మండలంలోని తీగలతండా గ్రామ పంచాయతీ పరిధిలోని రాయగూడెం సరస్వతిమాత ఆలయానికి చెందిన ఆర్చ్ నిర్మాణ పనులకు శుక్రవారం ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరిలు అర్చకుల వేద మంత్రా నడుమ శంకుస్థాపన చేశారు. అనంతరం సరస్వతీ మాత ఆలయ ప్రాంగణంలో చిన్నపెండ్యాల గ్రామంలోని మీనాక్షి రైస్ మిల్లు పాట్నర్ దొడ్డ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో కమిటీ సభ్యులతో ఏర్పాటు చేసిన నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆలయ ప్రాంగణంలోఆచార్య సోమలింగం అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ మాట్లాడారు. గుడికి ఎంపీ నిధుల నుంచి హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయిస్తానన్నారు. గుడి నిర్మాణానికి పూనుకున్న ఆచార్య సోమలింగాచారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ అక్షరాభాసం చేయించేందుకు వచ్చే భక్తులకోసం నిత్య అన్నదాన కార్యక్రమానికి ముందుకు వచ్చిన ఈశ్వరయ్య–రాజేశ్వరి దంపతులను అభినందించారు. తన వంతుగా రూ. లక్ష అన్నదాన కార్యక్రమానికి విరాళంగా ప్రకటించారు. అనంతరం ఆర్చ్ నిర్మాణానికి ముందుకొచ్చిన గోకె కర్ణాకర్, రాజు, గజ్జెల దామోదర్, తాళ్లపల్లి సంపత్, అన్నదానానికి ఒక్కొక్కరు రూ. లక్ష విరాళం అందించిన ఎడవెళ్లి మల్లారెడ్డి, సోమలింగం–సోమలక్ష్మి, గజ్జెల దామోదర్–వేదవతి, సంపత్–రజిత, లక్ష్మీ నారాయణ, సింగారెడ్డి, నర్సయ్య, బచ్చు శ్రీను, లింగయ్య, చంద్రశేఖర్, మామిడాల లింగారెడ్డిలను ఎంపీ, ఎమ్మెల్యేలు సన్మానించారు. కార్యక్రమంలో చిల్పూరు ఆలయ మాజీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, తాళ్లపల్లి సమ్మయ్య, ఇల్లందుల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి

పాలకుర్తి టౌన్: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా రెవిన్యూ విభాగం అనదపు కలెక్టర్ రోహిత్‌సింగ్ అన్నారు. గురువారం మండలంలోని గూడూరు, ఈరవెన్ను, శాతపురం గ్రామాల్లో పాలకుర్తి, తొర్రూరు సొసైటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ సందర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో సన్న రకం, దొడ్డు రకం ధాన్యాన్ని వేర్వేరుగా పోయించేందుకు నిర్వాహకులు కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో ఉండాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద నిర్వాహకులు అందుబాటులో లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దార్ పి శ్రీనివాస్, సివిల్ సప్లై డీటీ గుగులోత్ దేవానాయక్, తొర్రూరు సొసైటీ సీఈఓ రణధీర్, ఏఈఓలు దీపక్, స్నేహ, రైతులు తదితరులు ఉన్నారు.



నిర్వాహకులకు సూచనలు ఇస్తున్న అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్

9,10 తేదీల్లో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ

ఈ నెల 9,10 తేదీల్లో ఓటరు బాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని చేపట్టనునానమని, 18 ఏళ్ల నిండిన ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని పాలకుర్తి నియోజవర్గ ఓటరు నమోదు అధికారి, జిల్లా అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సవరణ 2025 క్యాంపెయిన్‌ను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఓటరు జాబితా సవరణలు నూతన ఓటర్లుగా నమోదు, జాబితాలో అభ్యంతరాలు, ఓటరు జాబితాలో సవరణలు తదితర అంశాలపై ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు.

విజయవంతం చేయాలి

జఫర్‌గఢ్: నేటి నుంచి చేపట్టనున్న సమగ్ర కుటుంబ సర్వేను విజయవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి రాధాకిషన్, ఎంపీడీఓ సుమన్ కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్యుమరేటర్లతో ప్రత్యేక సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా ఇంటింటికి స్టిక్కరింగ్ ప్రక్రియను మూడు రోజులపాటు నిర్వహించడం జరిగిందన్నారు. తహసీల్దార్ శంకరయ్య, ఎంఈఓ ఎండీ పర్వేజ్, అధికారులు, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాధాకిషన్

సమగ్ర సర్వేకు సహకరించండి

నర్మెట: ప్రభుత్వం తలపెట్టిన ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేకు మండల ప్రజలు సహకరించాలని తహసీల్దార్ సీహెచ్. రామానుజాచార్యులు కోరారు. సర్వే వివరాల సేకరణకు నేటి నుంచి వచ్చే సిబ్బందికి వివరాలు అందజేయాలని తెలిపారు.

ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలి

స్టేషన్‌ఘన్‌పూర్: విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు బాధ్యతగా కృషి చేయాలని ఎంఈఓ కొమురయ్య, ఘన్‌పూర్ జెడ్పీఎస్ఎస్ కాంప్లెక్స్ హెచ్‌ఎం సంపత్ అన్నారు. ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శుక్రవారం నిర్వహించిన నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే మాక్ టెస్టును వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ స్థాయిలో నిర్వహించే నేషనల్ అచీవ్‌మెంట్‌సర్వే విద్యార్థుల్లోని పఠన, అభ్యసనా సామర్థ్యాలను పెంపొందించేందుకు దోహదపడుతుందన్నారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు తమ పాఠశాలలను ముందు వరుసలో ఉండేలా చొరవతో పనిచేయాలని కోరారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



న్యాస్ పరీక్షను పరిశీలిస్తున్న ఎంఈఓ కొమురయ్య

ఎల్‌ఓసీ అందజేత



స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని నమిలిగొండ గ్రామానికి చెందిన కళ్యం సారమ్మకు అత్యవసర వైద్య చికిత్స కోసం బాధితురాలి కుటుంబ సభ్యులకు మాజీ ఎంపీటీసీ పురమాని రజాక్‌యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి చేతులమీదుగా శుక్రవారం రూ.2.50లక్షల ఎల్‌ఓసీని అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతిగా పనిచేస్తుందని, సీఎం ఆర్‌ఎఫ్ పేదల పాలిట వరం అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రజాక్‌యాదవ్‌తోపాటు తదితరులు పాలొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ



కొడకండ్ల: పరీక్ష ప్యాడ్లతో విద్యార్థులు

కొడకండ్ల: మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు రిటైర్డ్ ఉపాధ్యాయుడు జక్కుల ప్రభాకర్ శుక్రవారం పరీక్ష ప్యాడ్లు, కంపాక్స్ బాక్స్‌లు పంపిణీ చేశారు. ఇటీవల పదవీ విరమణ చేసిన ఆయన విద్యార్థులకు తనవంతు ప్రోత్సాహకంగా 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు పెన్నులను బహూకరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



పాలకుర్తి: ప్లేట్లతో విద్యార్థులు

ప్లేట్లు, నోట్ బుక్స్..

పాలకుర్తి: లయన్స్ క్లబ్ పాలకుర్తి ఆధ్వర్యంలో దత్తత గ్రామం దర్దేపల్లి పాఠశాలలో విద్యార్థులకు ప్లేట్లు, నోట్‌బుక్స్ శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మాచర్ల పుల్లయ్య, ఎర్రబెల్లి రాఘవరావు, పన్నీరు సారంగ పాణి, లయన్ రాపాక రమేశ్, వర్రె వెంకన్న, లయన్ బజ్జూరి వేణు గోపాల్, చిదిరాల మహేందర్, పబ్బ సంతోష్, వర్రె వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతులకు అన్యాయం చేస్తున్నారు

- తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య చందు

జనగామ రూరల్: కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అధికారులు కాటన్ మిల్లు యజమానులతో కుమ్మక్కై పత్తి రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య చందునాయక్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో రాపర్తి సోమయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా కొనుగోళ్ల సక్రమంగా చేపట్టకపోవడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించి తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ఇదే అదనుగా ధరలు అడ్డగోలుగా తగ్గించి రైతన్నలను నిండా ముంచుతున్నారని, తక్షణమే సీసీఐ కొనుగోళ్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సారయ్య, మీట్యానాయక్, రామచొక్కం, భవాని, అంజయ్య, శివ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చందు నాయక్

బహుమతుల ప్రదానం

లింగాలఘణపురం: సీఎం రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా శుక్రవారం మండలంలోని నెల్లుట్ల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గెలుపొందిన వారికి ఇన్‌చార్జ్ తహసీల్దార ఆండాలు బహుమతులను ప్రదానం చేశారు. యూత్ నాయకులు పాల్గొన్నారు.

సన్మానం

రఘునాథపల్లి: తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జగదీష్‌యాదవ్‌ను జిల్లా కబడ్డీ అసోసియేషన్, సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.కుమార్‌గౌడ్ మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఒలంపిక్ భవన్‌లో జగదీష్‌యాదవ్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బండి కుమార్, దుబ్బాక హరీష్, బాల్నె పరుశరాములు, ముప్పిడి సాంబ, మర్యాల మహేందర్ పాల్గొన్నారు.

పశు వైద్యశిబిరాన్ని వినియోగించుకోవాలి

పాలకుర్తి: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే పశు వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని పశువైద్యాధికారి దేవిరెడ్డి అశోక్‌రెడ్డి అన్నారు. మండలంలోని గూడెల్లిగూడెం గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. జేవీఓ శివప్రసాద్, గోపాల మిత్ర, సూపర్ వైజర్ రాజేశ్వర్‌రావు, చిక్కుడు సమ్మయ్య, సమ్మయ్య పాల్గొన్నారు.

నియామకం

బచ్చన్నపేట: తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఐజాక్ నియమితులయ్యారు. ఈ మేరకు మండల అధ్యక్షుడు శాగ కైలాసం శుక్రవారం తెలిపారు.

కారు–ద్విచక్రవాహనం ఢీ.. ఇద్దరికి గాయాలు

పాలకుర్తిటౌన్: రోడ్డు పై ధాన్యం ఆరబోయడంతో

సంక్షిప్తంగా

శుక్రవారం సాయంత్రం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల పాఠశాల వద్ద కారు–ద్విక్రవాహనం ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. కాగా, సంఘటన స్థలాన్ని ఎస్సై దూలం పవన్‌కుమార్ సందర్శించి ప్రమాద తీరును పరిశీలించారు. రోడ్డుపై ధాన్యం పోసిన రైతుల వివరాలను సేకరించారు. రోడ్లపై ధాన్యం ఆరబెట్టరాదని రైతులకు అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను పోలీసులు ఆస్పత్రికి తరలించారు.

ఎన్నిక

జనగామ రూరల్: సీపీఎం మండల కార్యదర్శిగా బోడ నరేందర్ రెండో సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎర్రగొల్లపహాడ్‌లో నిర్వహించిన మండల మహాసభలో ఆయనను ఎన్నుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

జఫర్‌గఢ్: రోడ్డు పక్కన అరబోసిన ధాన్యాల కుప్పల మూలంగా ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన తమ్మడపల్లి (జి) గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై రామ్‌చరణ్, స్థానికులు తెలిపిన ప్రకారం.. తమ్మడపల్లికి చెందిన కొంతం లక్ష్మీనారాయణ ద్విచక్ర వాహనంపై పంటపొలం వద్దకు వెళ్తున్నాడు. కాగా, రోడ్డు పక్కన ఆరబోయిన ధాన్యం కుప్పలపై పరదా కప్పి ఉండడంతో చీకట్లో కనిపించక బైక్ అదుపు తప్పి పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన జరిగిన కొద్ది సేపటికే రామచంద్రుతండాకు చెందిన మెకానిక్ బానోత్ భాస్కర్ పాలకుర్తి నుంచి తమ్మడపల్లి (జి) మీదుగా వస్తుండగా ధాన్యం కుప్ప వద్ద ప్రమాదానికి గురై తీవ్ర గాయాలపాలయ్యాడు. విషయం తెలుసుకున్న ఎస్సై రామ్‌చరణ్ ఘటన స్థలానికి చేరుకుని ప్రమాదానికి గురైన భాస్కర్‌ను వాహనంలో ప్రాథమిక చికిత్స నిమిత్తం జఫర్‌గఢ్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే భాస్కర్ స్పృహలోకి రాకపోవడంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై రామ్‌చరణ్ తెలిపారు. కాగా, క్షతగాత్రుడు లక్ష్మీనారాయణను చికిత్స నిమిత్తం హనుమకొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి స్థానికులు తరలించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బచ్చన్నపేట: అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం మండల కేంద్రంలో పట్టుకున్నట్లు ఎస్సై ఎస్‌కే హమీద్ తెలిపారు. రోజు మాదిరిగా మండలంలోని నక్కవానిగూడెం రోడ్డులో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఇసుక లోడ్‌తో వచ్చిన ట్రాక్టర్‌ను ఆపి చూడగా అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించి ట్రాక్టర్‌ను సీజ్ చేసి డ్రైవర్ రమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

గుడుంబా తయారీ స్థావరంపై పోలీసుల దాడి

దేవరుప్పుల: మండలంలోని పొట్టిగుట్టతండాలో గుట్టుచప్పుడు కాకుండా తయారు చేస్తున్న గుడుంబా స్థావరంపై శుక్రవారం తెల్లవారుజామున స్థానిక ఎస్సై ఊర సృజన్‌కుమార్ ఆధ్వర్యంలో దాడిచేసి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై కథనం ప్రకారం.. మండలంలోని కడవెండి రెవెన్యూ పరిధి పొట్టిగుట్టతండాలో జాటోత్ సురేష్, కిషన్ గుడుంబా తయారు చేసి అమ్ముతున్నారనే సమాచారంతో దాడి చేశామన్నారు. ఈ సందర్భంగా 3 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని, తయారీకి సంబంధించి 25 లీటర్ల బెల్లంపానకాన్ని ధ్వంసం చేశామని పేర్కొన్నారు. సదరు వ్యక్తులను తదుపరి చర్యల కోసం ఎక్సైజ్ పోలీసులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. ఈ దాడుల్లో కానిస్టేబుల్ మసూద్, సిబ్బంది పూర్ణచందర్ పాల్గొన్నారు.

ఘనంగా సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు



స్టేషన్‌ఘన్‌పూర్: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ డాక్టర్ కావ్య

సాక్షి నెట్‌వర్క్: సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం కాంగ్రెస్ శ్రేణులు జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అలాగే కొన్ని మండల కేంద్రాల్లో అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, మామిడాల యశస్వినిరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు గంగం నర్సింహారెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ జూలుకుంట్ల లావణ్యశిరీష్‌రెడ్డి, గ్రామ అధికారుల జిల్లా జేఏసీ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు నూకల బాల్‌రెడ్డి, నల్లనాగుల వెంకటాచారి, జంగిటి విద్యానాథ్, బెలిదె వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



పాలకుర్తి టౌన్: వేడుకల్లో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



బచ్చన్నపేట: అన్నదానం చేస్తున్న నాయకులు



జనగామ: గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జేఏసీ ఆధ్వర్యంలో..



నర్మెటలో..

‘గ్యారంటీల అమలులో ప్రభుత్వం విఫలం’

జనగామ రూరల్: ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, అలాగే కేంద్రంలో మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటూ పేదలను మరింత పేదవారిగా మార్చుతున్నారని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య అన్నారు. శుక్రవారం పట్టణంలో సీపీఎం పార్టీ కార్యాలయంలో రాపర్తి రాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. మోదీ జెమిలి ఎన్నికలను తీసుకు వచ్చేందుకు చూస్తున్నారని, దీనివల్ల ప్రజాస్వామ్యానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండీ అబ్బాస్, రమేష్, సోమయ్య, ఇర్రి అహల్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగయ్య

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బచ్చన్నపేట: మండలంలోని పలు సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో నేడు (శనివారం) అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ రాజ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఆలింపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు, లక్ష్మాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 12 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందన్నారు. పలు మరమ్మతు పనుల దృష్ట్యా సరఫరా నిలిపివేస్తున్నామని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.